సాక్షి తూర్పుగోదావరి

బుధవారం । 22 । నవంబర్ । 2023



నిత్యాన్నదాన పథకానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి కె.రామాంజనేయ ప్రసాద్ (మండపేట) రూ.1,00,116 విరాళాన్ని దేవస్థానం ఈఓ కె.రామ చంద్ర మోహన్‌కు మంగళవారం అందజేశారు.



హోమానికి రూ.లక్ష

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్య నారసింహ సుదర్శన హోమానికి సిరిపురపు రవిశంకర్ బోస్, కరుణశ్రీ దంపతులు (అమెరికా) ఆన్‌లైన్‌లో రూ.లక్ష విరాళం సమర్పించారు.

6 వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 6 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 600, మధ్య డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

రెడ్‌క్రాస్ సొసైటీను బలోపేతం చేయాలి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లా పరిధిలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీని బలోపేతం చేసేందుకు విద్యాసంస్థలను, విద్యార్థులను, యువతను సభ్యులుగా చేర్పాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం రెడ్ క్రాస్ కమిటీ సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ విద్యార్థులు రూ.20, విద్యా సంస్థలు రూ.300 చెల్లించి రెడ్ క్రాస్ సంస్థలో సభ్యత్వం తీసుకోవాలన్నారు. మరిన్ని సేవ, అవగాహన కార్యక్రమాలను నిర్వహించి, సమాజంలో చైతన్యవంతమైన కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములు చేయాలన్నారు. డీఆర్వో జి.నరసింహులు మాట్లాడుతూ రెడ్ క్రాస్ ద్వారా ప్రతి నెల కనీసం రెండు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ డాక్టర్.డాల్ సింగ్, సభ్యులు డాక్టర్ మహాలక్ష్మి, లంకా సత్యనారాయణ, జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.అబ్రహం, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



స్వామినాయుడు, జిల్లా పర్యాటక రీజినల్ డైరెక్టర్

రాజమహేంద్రవరం సిటీ: జిల్లాలో ఉత్తమ పర్యాటక ప్రాంతాల (గ్రామాల) ఎంపికకు గానూ 2024 ఏడాదికి పర్యాటక మంత్రిత్వశాఖ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక రీజినల్ డైరెక్టర్ వి.స్వామినాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయం, వారసత్వం, కళాఖండాలు తదితర విశేషాలు ఉన్న గ్రామాల ప్రజలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి కలవారు 63099 42025, 9121725757 నంబర్లను సంప్రదించాలన్నారు. బెస్ట్ రూరల్ టూరిజం విలేజెస్‌గా ఎంపికైన గ్రామాలకు రాష్ట్ర, జాతీయస్థాయిల్లో పురస్కారాలు అందజేస్తామని తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు తనూజ ఎంపిక



తనూజను అభినందిస్తున్న నరసింహారావు

తుని: జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు శ్రీప్రకాష్ జూనియర్ కళాశాలకు చెందిన కర్రి తనూజ ఎంపికైనట్టు విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు మంగళవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 16నుంచి 18 వరకు కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–19 బాలికల హ్యాండ్ బాల్ పోటీలో తనూజ ఉత్తమ ప్రతిభ చూపిందన్నారు. జాతీయ స్థాయికి అర్హత సాధించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున వచ్చే నెల హర్యానాలోని సిర్సాలో జరిగే జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటుందన్నారు. వరుసగా రెండు సార్లు జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికకావడం ఆనందంగా ఉందన్నారు. హ్యాండ్ బాల్ కోచ్ సురేష్ ఇచ్చిన శిక్షణతో ఈ అవకాశం లభించిందన్నారు. తనూజను ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

రబీకి వరివడిగా..

- నీటి లభ్యత తక్కువగా ఉన్నా పూర్తి స్థాయిలో అందించేందుకు కసరత్తు
- ముందస్తు చర్యలతో నీటి కొరత నివారణ
- జిల్లా వ్యాప్తంగా 86,896 హెక్టార్లలో సాగు లక్ష్యం
- అందుకు అనుగుణంగా సర్వం సిద్ధం
- ఇప్పటికే 51 హెక్టార్లలో నారుమడులు
- అందుబాటులో విత్తనాలు, ఎరువులు

సాక్షి, రాజమహేంద్రవరం: ఖరీఫ్ కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే 42 శాతం పూర్తయ్యాయి. ధాన్యం దిగుబడి ఆశాజనకంగా ఉంది. ఎకరానికి 40 బస్తాలు అందివస్తోంది. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సైతం వేగవంతంగా జరుగుతోంది. అదే సమయంలో రబీ సాగుకు సన్నాహాలు మొదలయ్యాయి. ఈ సీజనులో నీటి సరఫరాపై స్పష్టత వచ్చింది. దీంతో రైతులు ఉత్సాహంగా పొలాలను చదును, దమ్ము చేసి సిద్ధం చేయడంలో తలమునకలవుతున్నారు. మరికొంత మంది మరో అడుగు ముందుకేసి నారుమడులు వేస్తున్నారు. వీరిని మరింత ప్రోత్సహించేలా వ్యవసాయ శాఖ కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచింది. సలహాలు, సూచనలు అందిస్తోంది.

సాగు లక్ష్యం 86,496 హెక్టార్లు

జిల్లా వ్యాప్తంగా రబీలో 86,496 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగుచేయాలని వ్యవసాయ శాఖ లక్ష్యంగా నిర్దేశించుకుంది. సీజన్ సాధారణ విస్తీర్ణం 82,450 హెక్టార్లు. అత్యధికంగా 59,348 హెక్టార్లలో వరి సాగవుతుండగా 10,252 హెక్టార్లలో మొక్కజొన్న సాగవుతుంది. అవసరమైన విత్తన ప్రణాళికను వ్యవసాయ శాఖ రూపొందించింది. 59,348 హెక్టార్లకు గాను 28,000 క్వింటాళ్ల విత్తన ఆవస్యకత ఉంది. అందులో 80 శాతం విత్తనం రైతుల వద్దే ఉంది. మిగిలిన విత్తనాన్ని కోఆపరేటీవ్, లైసెన్స్‌డ్ ప్రైవేట్ సప్లయర్స్ నుంచి సేకరించనున్నారు. 10,252 హెక్టార్లలో మొక్కజొన్న సాగు చేపట్టనుండగా వీటని కోఆపరేటీవ్, లైసెన్స్‌డ్ ప్రైవేట్ సప్లయర్స్ నుంచి సేకరించనున్నారు. పప్పులు, ఉలవలు, పెసలు, మినుము సాగు చేయనున్నారు.

అందుబాటులో ఎరువులు

ఎరువులు అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వ అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. సీజన్ ఆరంభం కాకముందే ముందస్తుగా సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు భావిస్తున్నారు. తద్వారా సాగు సమయంలో రైతుల వ్యయ ప్రయాసలను దూరం చేయనున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే సింహభాగం గోదాముల్లో నిల్వ ఉంచారు. రబీ సీజన్‌లో లక్ష మెట్రిక్ టన్నుల ఎరువులు వవసరమని అంచనా. ఇప్పటికే 22,000 వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచారు. అవి కాకుండా రైతు భరోసా కేంద్రాల్లో మరో 30,000 మెట్రిక్ టన్నులు నిల్వ ఉంచారు. ఆర్బీకేల ద్వారా సులభంగా పొందే వెసులుబాటు కల్పించారు.

జిల్లాలో రబీ వరి సాగు ఇలా. (హెక్టార్లలో)

పంట	గతేడాది సాగు విస్తీర్ణం	ఈసారి లక్ష్యం
వరి	55,092	59,348
మొక్కజొన్న	8,976	10,252
ముతక ధాన్యాలు	9,192	10,542
కందులు	823	6
పెసలు	97	898
మినుములు	348	1335
పప్పు దినుసులు	1,278	3,337



వరి సాగుకు దుక్కి దున్నుతున్న రైతు (ఫైల్)

నీటి కొరత నివారణకు ప్రణాళికలు

ఈ ఏడాది జూన్ నుంచి నవంబర్ వరకూ లోటు వర్షపాతమే నమోదైంది. జూలైలో తప్ప మిగిలిన నెలల్లో గోదావరి వరద జాడ కనిపించలేదు. ఫలితంగా రబీలో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. అయినా ప్రత్యామ్నాయ చర్యలతో నీటి కొరతను అధిగమించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. గోదావరి డెల్టా పరిధిలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో 8,96,507 ఎకరాల రబీ ఆయకట్టు ఉంది. వీటిలో పంటల సాగుకు 91.35 టీఎంసీల నీరు అవసరం. 82.49 టీఎంసీలు అందుబాటులో ఉంది. కొరత ఉన్న 8.86 టీఎంసీల నీటిని వివిధ మార్గాల ద్వారా సమకూర్చేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. రైతులు సైతం కొన్ని జాగ్రత్తలు పాటించాలని కోరుతోంది. టర్న్ సిస్టం(వారబందీ) ద్వారా నీటిని పొదుపు చేసి 5 టీఎంసీలు, కాలువలపై క్రాస్ బండ్ల ఏర్పాటు, డీజిల్ పంపుల వినియోగంతో నీటిని ఎత్తిపోయడం లాంటి పద్ధతులతో మరో 3.86 టీఎంసీలు సమకూర్చనుంది.

ముందస్తుతో మేలు

పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు, బిక్కవోలు, అనపర్తి మినహా మిగిలిన ప్రాంతాల్లో సాగునీటి కొరత తలెత్తే అవకాశం లేదు. చెరువులు, ట్యాంకులు, బోర్ల ద్వారా 60 శాతం నీటిని అందించే అవకాశం ఉంది. నిర్దేశించిన ప్రాంతాల్లో రబీలో నీటి కొరతను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ పద్ధతులు పాటించాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ఈనెల 30వ తేదీలోగా ఖరీఫ్ పంట కోతలు పూర్తి చేయాలి. రబీ నాట్లు ముమ్మరం చేసేలా డిసెంబర్ 1 నుంచి 10వ తేదీ వరకు రైతులకు అవగాహన కల్పించడం. డిసెంబర్ 31 నాటికి రబీ సీజన్ నాట్ల ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. సింహభాగం సన్నరకాలు సాగు చేయాలని సూచిస్తున్నారు. ఎంటీయూ–1121, (శ్రీదృతి), ఆర్‌ఎన్‌ఆర్ 15048, అనంతరం బీపీటీ తదితర రకాల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నారు. తద్వారా 120 నుంచి 130 రోజుల్లో పంట పూర్తవుతుందని, నీటి ఎద్దడిని సైతం ఎదుర్కొనే వెసులుబాటు కలుగుతుందని స్పష్టం చేస్తున్నారు.

ప్రణాళిక సిద్ధం



రబీ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశాం. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచుతున్నాం. పంటల సాగులో సలహాలు, సూచనలు ఇస్తున్నాం. పంటల సాగుతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరిస్తున్నాం. నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాం. ముందస్తుగా పంట సాగుకు ప్రోత్సహిస్తున్నాం. ఈ ఏడాది ఖరీఫ్ దిగుబడులు సైతం ఆశాజకంగా ఉన్నాయి. ఎకరానికి 40 బస్తాల దిగుబడి అందుతోంది.

– ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



55 హెక్టార్లలో నారుమడులు

జిల్లాలో ఇప్పటికే రైతులు రబీ సాగుకు అడుగులు వేస్తున్నారు. చాగల్లు, నల్లజర్ల, తాళ్లపూడి, రాజమండ్రి మండలాల్లో 51 హెక్టార్లలో నారుమళ్లు సిద్ధం చేస్తున్నారు. వెదజల్లు విధానాన్ని అనుసరిస్తే సత్ఫలితాలు వస్తాయని వ్యవసాయ శాఖ స్పష్టం చేస్తోంది. దమ్ము చేసి, విత్తనాలు వేసి, నారు పెంచి, నాట్లు వేసే దశకు 25 నుంచి 28 రోజుల సమయం పడుతుంది. ఎకరం సాగుకు 25 నుంచి 30 కిలోల విత్తనాలు అవసరమవుతాయి. వెదజల్లులో పెట్టుబడి, సమయం కలిసి వస్తాయి. దమ్ము చేసి, చదును చేసిన వెంటనే నేరుగా వెదజల్లితే 14 కేజీల విత్తనాలు సరిపోతాయి. సగం విత్తనంతో పాటు రెండు వారాల సమయం కూడా ఆదా అవుతుంది. ఆకుతీత, నాట్లకు అయ్యే పెట్టుబడి భారం తగ్గుతుంది.

చేపలు, రొయ్యల ఉత్పత్తిలో అగ్రస్థానం



ధవళేశ్వరం వద్ద గోదావరిలో చేప పిల్లలను వదులుతున్న కలెక్టర్ మాధవీలత, ఎంపీ భరత్ రామ్

ధవళేశ్వరం: చేపలు, రొయ్యల ఉత్పత్తిలో దేశంలోనే మన రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా మంగళవారం ధవళేశ్వరం కంచర్లలైన్ రేవులో కడియం మత్స్య విత్తన క్షేత్రంలో ఉత్పత్తి చేసిన 29.83 లక్షల చేప పిల్లలను, అలాగే బోట్స్ మెన్, ఫిషర్‌మెన్ మత్స్య సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో తయారు చేసిన ఐదు లక్షల స్కాంపి రొయ్య పిల్లలను గోదావరిలో వదిలారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ గోదావరిలో చేపల వేట సాగిస్తూ ఐదువేల కుటుంబాలు ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్నాయని, చేపల మార్కెటింగ్ ద్వారా మరో 3,500 కుటుంబాలకు ఉపాధి లభిస్తోందన్నారు. ఆక్వా రైతులకు ఒక యూనిట్ విద్యుత్తును రూ.1.50కు ప్రభుత్వం అందజేస్తోందని, దీని ద్వారా ఆక్వా రంగం సుస్థిరత సాధిస్తుందని తెలిపారు. జిల్లాలో 4,500 ఎకరాల విస్తీర్ణంలోని 67 మైనర్ ఇరిగేషన్ చెరువులను మత్స్య సహకార సంఘాలకు నామమాత్రం లీజుకు ఇవ్వడం ద్వారా వారి జీవన ప్రమాణాలు పెరుగుతున్నాయన్నారు.

ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ మత్స్య పరిశ్రమ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని వేల కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయన్నారు. దీనికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నాయన్నారు. ఇందులో సీ కేజ్ కల్చర్ ముఖ్యమైందని తెలిపారు. అనంతరం మత్స్య సహకార సంఘం అధ్యక్షులు, ఫీల్డ్ సిబ్బందిని సత్కరించారు. కార్యక్రమంలో రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి వి.కృష్ణారావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ దిల్షాద్, ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు ఎస్‌బీ గణేశ్వరరావు, డి.గోపాలరావు, మత్స్యశాఖ సహాయ తనిఖీ అధికారులు వి.దేవానందం, కె.హరీష్, పి.కృష్ణవేణి పాల్గొన్నారు.

వికసిత్ యాత్రతో కేంద్ర పథకాలపై అవగాహన

- అర్హులందరికీ లబ్ధి చేకూర్చడమే లక్ష్యం
- కేంద్ర ఉన్నత విద్య డిప్యూటీ సెక్రటరీ ప్రియాంక్ చతుర్వేది



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర ఉన్నత విద్య డిప్యూటీ సెక్రటరీ ప్రియాంక్ చతుర్వేది, చిత్రంలో కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరు, ప్రజలు పొందుతున్న లబ్ధి, అర్హుల వివరాలను తెలుసుకోవడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ముఖ్య ఉద్దేశమని కేంద్ర ప్రభుత్వ నోడల్ అధికారి, కేంద్ర ఉన్నత విద్య డిప్యూటీ సెక్రటరీ ప్రియాంక్ చతుర్వేది అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం కలెక్టర్ మాధవీలత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వికసిత్ యాత్ర ముందస్తు ప్రణాళికపై జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రియాంక్ చతుర్వేది మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల ప్రాంతాల వరకూ చిట్ట చివరి లబ్ధిదారుడికీ కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరేలా ప్రతి అధికారి, ఉద్యోగి కృషి చేయాలన్నారు. జిల్లాలోని వివిధ శాఖలలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను, లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంచార ప్రచార వాహనాన్ని కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై పట్టణాలు, గ్రామాల్లో విస్తత ప్రచారం నిర్వహించాలన్నారు. జన్‌ధన్, పారిశ్రామిక, ఉజ్వల్, హౌసింగ్, స్వమిత్వ సర్వేలపై ఆరా తీశారు.

కార్యాచరణ ప్రణాళిక పూర్తి : కలెక్టర్

కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలపై పట్టణాలు, గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించడానికి ఇప్పటికే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ఆహ్వానం, ఉత్సవ్, సంస్కృతికి సంబంధించి ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఈనెల 25 నుంచి 2024 జనవరి 26 వరకూ క్షేత్ర స్థాయిలో ప్రచారం, అవగాహన కార్యక్రమాలకు కార్యాచరణ ప్రణాళిక పూర్తయ్యిందన్నారు. జిల్లాకు కేటాయించిన రెండు వాహనాల ద్వారా 300 గ్రామ పంచాయతీలలో ప్రచారం చేసేలా రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డీపీవో జిల్లా నోడల్ అధికారి జేవీ సత్యనారాయణ, అదనపు ఎస్పీ ఎం.రజనీ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు పి.సువర్ణ, ఎం.భాను ప్రకాష్ పాల్గొన్నారు.

మత్స్యకార జీవితాల్లో వెలుగులు





లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి విశ్వరూప్, ఎంపీలు మోపిదేవి, వంగా గీత, ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు, కార్యక్రమానికి హాజరైన జనసందోహం

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే వారికి అధికంగా లబ్ధి
- వారి సంక్షేమానికి పెద్దపీట
- కోరంగి మత్స్యకార దినోత్సవ సభలో మంత్రి విశ్వరూప్

తాళ్లరేవు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. టీటీడీ పాలక మండలి సభ్యుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అధ్యక్షతన కోరంగిలో మంగళవారం ప్రపంచ మత్స్యకార దినోత్సవ సభ నిర్వహించారు. ఓఎన్‌జీసీ కార్యకలాపాలతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో జీవనోపాధి కోల్పోయిన 23,458 మత్స్యకార కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వ చొరవతో.. ఆ సంస్థ నాలుగో విడతగా ఒక్కొక్కరికి నెలకు రూ.11,500 చొప్పున 6 నెలలకు రూ.161.86 కోట్ల ఆర్థిక సాయాన్ని మంజూరు చేసింది. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం కంప్యూటర్ బటన్ నొక్కి లబ్ధిదారులైన మత్స్యకారుల ఖాతాల్లోకి ఈ నిధులు జమ చేశారు.

ఈ కార్యక్రమాన్ని వర్చువల్‌గా వీక్షించిన అనంతరం కోరంగిలో జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి విశ్వరూప్ ప్రసంగించారు. మత్స్యకారుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, ఎక్కువ లబ్ధి చేకూర్చిందని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సామాజిక సాధికారత సాధ్యమన్నారు. నలుగురు బీసీ నేతలను రాజ్యసభకు పంపడంతో పాటు ఐదుగురు ఎస్సీలకు మంత్రి పదవులు ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని చెప్పారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు తన పాలనలో పేదల సంక్షేమాన్ని విస్మరించారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు కేవలం 14 లక్షల మందికి పింఛన్లు ఇస్తే, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏకంగా 64 లక్షల మందికి పింఛన్లు అందిస్తూ పేదల పట్ల తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని అన్నారు. అలాగే 2014 ఎన్నికల ముందు జాబు రావాలంటే బాబు రావాలని చెప్పి.. తీరా అధికారంలోకి వచ్చాక కనీసం వెయ్యి ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. ఆయన కుమారుడికి మాత్రం మంత్రి పదవి ఇచ్చుకున్నారని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఆరు నెలల్లోపే సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి 1.40 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారని చెప్పారు. ఒక రాష్ట్రంలో 2 లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిన ఏకైక నాయకుడు జగనేనని మంత్రి విశ్వరూప్ అన్నారు.

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణా రావు మాట్లాడుతూ, గతంలో చంద్రబాబు రాజ్యసభ వంటి పదవులను వందల కోట్ల రూపాయలకు అమ్ముకున్నారని, దీనికి భిన్నంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అన్నింటా పెద్దపీట వేస్తున్నారని అన్నారు. కాకినాడ ఎంపీ వంగా గీత మాట్లాడుతూ, పేదవాడు ఎవరి వద్దా చేయి చాచకుండా, అందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఏకైక సీఎం జగన్ అని అన్నారు. పేదవాడికి విద్య, వైద్యం అందుబాటులోకి తేవడంతో పాటు ఎటువంటి వివక్షా లేకుండా ప్రతి పేదకూ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఆయనకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ, గత టీడీపీ ప్రభుత్వం మత్స్యకారులకు చేసిందేమీ లేదని అన్నారు. మత్స్యకారులకు ఇవ్వాల్సిన నష్ట పరిహారం ఇవ్వకపోతే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే అందజేసిందని గుర్తు చేశారు. ఓఎన్‌జీసీ నిధులు ఇవ్వడం ఆలస్యం చేసినా.. ప్రభుత్వ పరంగా ఇద్దామని చెప్పిన మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు.

తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని మంత్రి విశ్వరూప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రితో పాటు ఎంపీలు మోపిదేవి, వంగా గీత, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తదితరులు 23,458 మంది లబ్ధిదారులకు ఓఎన్‌జీసీ నష్టపరిహారం నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఎమ్మెల్సీలు పండుల రవీంద్రబాబు, కర్రి పద్మశ్రీ, కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, మత్స్యశాఖ జేడీ షేక్ లాలా మహ్మద్, కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిషోర్, జెడ్పీ వైస్ చైర్మన్ బొర్రా అనుబాబు, మేరుగు పద్మలత తదితరులు పాల్గొన్నారు.

పేదల భూములకు శాశ్వత హక్కు పత్రాలు

- జేసీ తేజ్ భరత్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- కాటవరంలో పట్టాల ప్రదానం



కాటవరంలో రైతులకు పట్టాలు అందిస్తున్న జేసీ తేజ్ భరత్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: సుదీర్ఘ కాలంగా ఉన్న భూసమస్యలను పరిష్కరించడంతో పాటు నిరుపేదలకు భూమి పంపిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. నియోజకవర్గంలోని రైతు కుటుంబాలకు వ్యవసాయ, అసైన్డ్, ఈనాం, ఎస్సీ కార్పొరేషన్, 22ఏ జాబితా నుంచి తొలగించిన భూములను మంగళవారం పంపిణీ చేశారు. మండలంలోని కాటవరంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజానగరం నియోజకవర్గంలోని 4,831 మందికి 1,091 ఎకరాలను పంపిణీ చేశారు.

నిరుపేదల అభ్యున్నతికి..

జేసీ తేజ్ భరత్ మాట్లాడుతూ నిరుపేదల అభ్యున్నతి కోసమే భూమి పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లాలో 1,296 మంది నిరుపేదలకు 1,025 ఎకరాల అసైన్డ్ భూములను, అలాగే 3,182 మందికి 919 ఎకరాల లంక భూముల హక్కు పత్రాలను అందజేస్తున్నామన్నారు. దశాబ్దాలుగా నిషేధిత భూముల జాబితాలో ఉన్న 1,809 మందికి చెందిన 1,564 ఎకరాల అసైన్డ్ భూములకు హక్కులు అందిస్తున్నట్లు వివరించారు. నిషేధిత భూముల జాబితా నుంచి అసైన్డ్ భూములను తొలగించడం, భూమిలేని నిరుపేదలకు పట్టాలు ఇవ్వడం, నామ్ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించడం, ఎస్సీలకు శ్మశాన వాటిక కోసం భూమి కేటాయింపులు చేయడం, లంకభూములకు పట్టాల పంపిణీలో భాగంగా జిల్లాలో 38,432 మందికి 5,500 ఎకరాలను పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు.

పేదలకు సర్వ హక్కులు

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమంతో పాటు అనేక రకాల పరిపాలన సంస్కరణలు అమలవుతున్నాయి. భూమి మీద పూర్తి హక్కు లేక ఇబ్బందులు పడుతున్న వారందరికీ ముఖ్యమంత్రి జగన్ తీసుకున్న సాహసోపేత నిర్ణయంతో ఊరట లభించిందన్నారు. ముఖ్యంగా గిరిజనులకు రోపర్ ల్యాండ్స్, బీసీలకు సర్వీస్ ఈనాం భూములు, ఎస్సీలకు అసైన్డ్‌మెంట్ భూముల పట్టాల మీద సర్వ హక్కులు కల్పించిందన్నారు. నియోజకవర్గంలో 4,831 మందికి వివిధ భూముల కింద దాదాపు 1,091 ఎకరాల భూమిని పంపిణీ చేశారన్నారు. అలాగే లంకభూములకు సంబంధించి బీ సీ క్లాస్‌ల పరిధిలో 1,488 మందికి 274 ఎకరాల భూములను అందించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు ముదునూరి సురేష్ రాజు, సత్యం మదన్‌బాబు, ఎంపీటీసీ తాడేపల్లి వెంకట్రావు, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, అంబటి రాజు, మద్దాల కొండలరావు, గణేశుల పోశయ్య, రమాదేవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

275 ఫోన్ల రికవరీ



రికవరీ అయిన సెల్‌ఫోన్లను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం: చోరీకి గురైన 275 ఫోన్లను జిల్లా పోలీసులు రికవరీ చేశారు. కాకినాడలోని తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఈ వివరాలు వెల్లడించారు. జిల్లాలో పోగొట్టుకున్న, చోరీ అయిన 275 ఫోన్లను మోబీట్రాక్ కాకినాడ పోలీసు సేవల ద్వారా రికవరీ చేశామని చెప్పారు. రికవరీలో సాంకేతిక పరిజ్ఞానంతో పాటు జిల్లాలోని పలువురు ఎస్‌హెచ్‌ఓలతో పాటు జిల్లా పోలీసు ఐటీ కోర్ విభాగం సిబ్బంది కీలకంగా వ్యవహరించారని ఎస్పీ తెలిపారు.

గోదావరిలో పడి గీత కార్మికుడి మృతి



మృతుడు శ్రీనివాసరావు (పాత చిత్రం)

రాజోలు: ప్రమాదవశాత్తూ వశిష్ట గోదావరి నదిలో పడి రాజోలు బొడ్డపల్లి వారి గ్రూపునకు చెందిన గీత కార్మికుడు కలిగితి శ్రీనివాసరావు (54) మృతి చెందాడు. వివరాలివీ.. రాజోలు మధ్య లంకలో వ్యవసాయ పనుల నిమిత్తం శ్రీనివాసరావు ఈ నెల 19న యిల్లింగి పనసయ్యకు చెందిన పడవ తీసుకుని గోదావరి నది దాటుతున్నాడు. ఆ క్రమంలో వేగంగా గాలి వీయడంతో ప్రమాదవశాత్తూ నదిలో పడిపోయాడు. శివకోడు లంక సమీపాన శ్రీనివాసరావు మృతదేహాన్ని మంగళవారం గుర్తించారు. అతడి సోదరుడు వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు రాజోలు పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనివాసరావు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీనివాసరావు కుటుంబాన్ని సర్పంచ్ రేవు జ్యోతి, ఎంపీటీసీ సభ్యులు చెల్లింగి లక్ష్మీ ఈశ్వరి, కొపనాతి పుష్పలత, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి మట్టా ఏడుకొండలు తదితరులు పరామర్శించారు.

పగబట్టిన ప్రకృతి



మృతులు గరికిన సత్తిరాజు, మైలపిల్లి కృపదాసు (పాత చిత్రాలు)

- గాలులు, అలల తీవ్రతకు ఒరిగిన తెప్ప
- సముద్రంలో గల్లంతై, ఇద్దరు మత్స్యకారుల మృతి
- సురక్షితంగా ఒడ్డుకు చేరిన మరో ముగ్గురు

సోమవారం.. తెల్లవారేసరికి పరిస్థితి రోజూ మాదిరిగా లేదు. నింగిలో మబ్బులు.. నేలపై నన్నగా.. కాస్త రివ్వున వీస్తున్న ఈదురు గాలులు.. అంతా ప్రతికూల వాతావరణం. అంతలోనే తోటి మత్స్యకారుడి వలకు భారీగా మత్స్య సంపద చిక్కిందనే సమాచారం వారిలో ఉత్సాహాన్ని ఉరకలెత్తించింది. తీరానికి వెళ్లి చూస్తే కడలి కల్లోలంగానే ఉంది. అలలు దాటి లోపలకు వెళ్తే ప్రమాదమే. అయినప్పటికీ వేటకు వెళ్లాలనే ఆ గంగపుత్రులు నిర్ణయించుకున్నారు. మొత్తం ఐదుగురు కలసి ఓ తెప్పపై సంద్రంలోకి వెళ్లారు. తిరిగి ముగ్గురే తీరానికి క్షేమంగా చేరారు. మరో ఇద్దరు గంగమ్మ తల్లికి బలైపోయారు. ఈ సంఘటన కాకినాడ సూర్యారావుపేటలోని రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది.



ఇద్దరి మృతికి కారణమైన ఫైబర్ తెప్ప



కృపదాసు ఇంటి వద్ద విషాదంలో భార్య గంగ



ఇంటి వద్ద రోదిస్తున్న సత్తిరాజు భార్య లక్ష్మి

కాకినాడ రూరల్: స్థానిక ఫిషింగ్ హార్బర్ నుంచి సోమవారం చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుల్లో ఇద్దరు సముద్రంలో తెప్ప బోల్తా పడి గల్లంతయ్యారు. వారి మృతదేహాలు మంగళవారం లభ్యమయ్యాయి. వివరాలివీ.. సహచర మత్స్యకారుడి వలకు ఎక్కువ మొత్తంలో చేపలు పడ్డాయని ఉదయమే తెలియడంతో.. సూర్యారావుపేట మైనర్ పేటకు చెందిన తిక్కడ అమ్మోరయ్య తెప్పపై అతడితో పాటు, అదే ప్రాంతానికి చెందిన గరికిన సత్తిరాజు (63), చింతకాయల తాతీలు, గరికిన మల్లేష్, అదే గ్రామంలోని దుమ్ములపేటకు చెందిన అమ్మోరయ్య అల్లుడు మైలపిల్లి కృపదాసు (38) సోమవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. ప్రతికూల వాతావరణం ఉన్నా లెక్క చేయకుండా సూర్యారావుపేట లైట్ హౌస్ ఎదురుగా తీరం దరిలో ఉత్సాహంగా చేపల వేట సాగించారు. వల నిండా కానగంతలు, కిలాలు వంటి చేపలు పడ్డాయి. దీంతో రాత్రి ఏడు గంటల సమయంలో సంతోషంతో తిరుగు పయనమయ్యారు.

ముంచేసిన గాలులు, అలలు

ఆ సమయంలో ఈదురు గాలులు, కెరటాల తీవ్రత అధికంగా ఉంది. ప్రకృతి పగబట్టిన ఈ పరిస్థితుల్లో సూర్యారావుపేట బీచ్ ఎదురుగా ఉన్న తీరానికి చేరుతున్న సమయంలో వారి ఫైబర్ తెప్ప ఒక్కసారిగా సముద్రంలో బోల్తా పడింది. దీంతో, అందులోని ఐదుగురు మత్స్యకారులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. కనుచూపు మేరంతా గాఢాంధకారం. అరచి కేకలు పెట్టినా వినేవారే లేరు.. చిమ్మ చీకట్లో ఏం జరిగిందో తెలియక ప్రాణాలు అరచేత పట్టుకుని ఆ తెప్పతోనే ప్రాణాలు కాపాడుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో అమ్మోరయ్య, తాతీలు, మల్లేష్ తీరానికి సురక్షితంగా చేరుకున్నారు. సత్తిరాజు, కృపదాసు గల్లంతయ్యారు. విషయం తెలుసుకున్న ఇతర మత్స్యకారులు గల్లంతైన ఇద్దరు మత్స్యకారుల కోసం రాత్రంతా గాలింపు చేపట్టారు. కృపదాసు మృతదేహాన్ని మంగళవారం ఉదయం సముద్రంలో గుర్తించి, ఒడ్డుకు తీసుకు వచ్చారు. సత్తిరాజు మృతదేహం సూర్యారావుపేట బీచ్‌లో మధ్యాహ్నం లభ్యమైంది. ప్రపంచ మత్స్యకార దినోత్సవం నాడు జరిగిన ఈ సంఘటన సత్తిరాజు, కృపదాసు కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగిల్చింది. మత్స్యకారులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ సంఘటనపై కాకినాడ పోర్టు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అండగా ఉంటాం: ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

తెప్ప బోల్తా పడి, మత్స్యకారులు మృతి చెందిన ఘటనపై కాకినాడ రూరల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కురసాల కన్నబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో మృతులకు సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని చెప్పారు. ఈ దుర్ఘటనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని, మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రూ.10 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని ప్రకటించారు.



మృతులకు సంతాపం తెలుపుతున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

మిన్నంటిన రోదనలు

- మైనర్‌పేటకు చెందిన మత్స్యకారుడు సత్తిరాజుకు భార్య లక్ష్మి, కుమారుడు, వివాహమైన కుమార్తె ఉన్నారు. మానసికంగా సరిగా లేకపోవడంతో కుమారుడికి వివాహం జరగలేదు. కుటుంబానికి ఆధారంగా ఉన్న సత్తిరాజు మృతి చెందాడని తెలుసుకున్న భార్య లక్ష్మి గుండెలు పగిలేలా రోదించింది. దీంతో ఆ ప్రాంతమంతటా విషాదం అలముకుంది.
- మరో మృతుడు కృపదాసు సూర్యారావుపేటకు చెందిన ఫైబర్ తెప్ప యజమాని అయ్యోరయ్యకు స్వయంగా అల్లుడు. అయ్యోరయ్య తన కుమార్తె గంగను దుమ్ములపేటకు కృపదాసుకు ఇచ్చి వివాహం చేశాడు. కృపదాసు దంపతులకు ఇద్దరు పిల్లలు. అతడి మృతితో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. భర్త మృతితో మిన్నంటేలా రోదించిన గంగను కట్టడి చేయడం కుటుంబ సభ్యులకు కష్టమైంది. అల్లుడి మృతితో అయ్యోరయ్య ఇంట తీరని విషాదం నెలకొంది.

గంజాయి తాగుతున్న ఐదుగురి అరెస్టు

నిడదవోలు: పట్టణంలోని తాడేపల్లిగూడెం ప్రధాన రహదారిలో రైల్వే కాలిబాట వంతెన వద్ద గంజాయి తాగుతున్న ఐదుగురు యువకులను పట్టణ పోలీసులు సోమవారం రాత్రి అరెస్టు చేశారు. ముందుగా అందిన సమాచారంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణ ఎస్సై పి.నాగరాజు తన సిబ్బంది, రెవెన్యూ అధికారులతో కలిసి వారిపై దాడి చేశారు. తల్లిదండ్రుల సమక్షంలో ఆ యువకులకు సీఐ కె.వెంకటేశ్వరరావు, ఎస్సై పి.నాగరాజు పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఆన్‌లైన్‌లో మెరిట్ లిస్ట్

కాకినాడ క్రైం: నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ (ఎన్‌ఆర్‌హెచ్‌ఎం) గతంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో ప్రకటించిన ఉద్యోగ దరఖాస్తులకు సంబంధించి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ మంగళవారం తుది మెరిట్ లిస్ట్ విడుదల చేసింది. అభ్యర్థులు ఈస్ట్‌గోదావరి.ఏపీ.జీఓవీ.ఇన్, కోనసీమ.ఏపీ.జీఓవీ.ఇన్, కాకినాడ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్లలో తమ పేర్లు పరిశీలించుకోవచ్చు. అభ్యంతరాలుంటే గురువారం సాయంత్రం 5 గంటలలోగా కాకినాడలోని తమ కార్యాలయంలో సమర్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి నరసింహ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన మౌనిక (పాత చిత్రం)

కాకినాడ రూరల్: నగరానికి చెందిన ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. సర్పవరం పోలీసుల కథనం ప్రకారం.. గాంధీనగర్‌కు చెందిన దువ్వపు మౌనిక (17) కాకినాడ నాగమల్లితోట జంక్షన్ వద్ద ఉన్న ఆశ్రమ పబ్లిక్ స్కూల్‌లో +2 ఎంపీసీ చదువుతోంది. మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో వాష్‌రూముకని వెళ్లిన ఆమె స్కూల్ ప్రాంగణంలోని పాత భవనం మూడో అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. వెంటనే ఆమెను విద్యార్థులు, ఉపాధ్యాయులు దగ్గరలోని టీమ్ ఆస్పత్రిలో చేర్పారు. అయితే, తీవ్ర రక్తస్రావం కావడంతో మౌనిక మృతి చెందింది. మౌనిక తండ్రి కుమారస్వామి బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. తల్లి, సోదరునితో కలిసి మౌనిక గాంధీనగర్‌లో ఉంటోంది. గత ఏడాది ఆశ్రమ పబ్లిక్ స్కూల్‌లో +వన్‌లో టాపర్‌గా గుర్తింపు పొందింది. ఆమె ఆత్మహత్యతో విద్యార్థులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. పాఠశాలకు మధ్యాహ్నం నుంచి సెలవు ప్రకటించారు. చదువులో టాపర్‌గా ఉన్న మౌనిక ఆత్మహత్యకు పాల్పడడం బాధాకరమని ప్రిన్సిపాల్ అగస్టీన్ అన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తామని సీఐ మురళీకృష్ణ తెలిపారు.

నిందితుడికి ఐదేళ్ల జైలు

కోటనందూరు: ఒక యువకుడి మృతికి కారణమైన మరో యువకుడికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ పిఠాపురం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి మాధవి మంగళవారం తీర్పు చెప్పారు. స్థానిక ఎస్సై బి.శంకర్ కథనం ప్రకారం.. కోటనందూరుకు చెందిన ఉల్లూరి లచ్చ, మళ్ల పవన్ దుర్గా సతీష్ తాపీ పని చేస్తూండేవారు. కూలి డబ్బుల విషయంలో వాగ్వాదం జరగడంతో ఇద్దరూ బాహాబాహీకి దిగారు. ఈ క్రమంలో రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయమై లచ్చ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై అతడి భార్య ఉల్లూరి మహాలక్ష్మి (నాగలక్ష్మి) 2021 జూన్ 15న స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై ఎం.అశోక్ కేసు నమోదు చేయగా, నాటి తుని రూరల్ సీఐ కొత్తూరి కిషోర్ బాబు దర్యాప్తు చేసి, చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టు విచారణలో లచ్చ మృతికి పవన్ దుర్గా సతీష్ కారకుడని నిర్ధారణ అవడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ఈ కేసులో మృతుని భార్య తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.కిరణ్ వాదనలు వినిపించారు.

బాలికపై లైంగిక దాడి

అనపర్తి: అభం శుభం తెలియని ఎనిమిదేళ్ల బాలికపై వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడిన దుర్ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అనపర్తి పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బొల్లాడి సత్యనారాయణ తన ఇంటి సమీపాన ఉన్న బాలికపై ఈ నెల 13న ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆ బాలిక నోరు నొక్కి ఇంట్లోకి తీసుకువెళ్లి లైంగిక దాడికి ఒడిగట్టాడు. ఈ విషయం ఎవరికైనా చెప్తే చంపేస్తానంటూ ఆ చిన్నారిని బెదిరించాడు. అప్పటి నుంచీ బాధిత బాలిక తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతూ అనారోగ్యానికి గురైంది. ఆమెను తల్లి నిలదీయడంతో జరిగిన ఘోరం వెలుగులోకి వచ్చింది. ఈ దారుణంపై బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై జగన్‌మోహన్‌రావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రేపు విఘ్నేశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు



అయినవిల్లి: విఘ్నేశ్వరుని ఆలయంలో హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించనున్నారు. ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, ఈఓ ముదునూరి సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఆలయ సిబ్బంది, దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు, గ్రామస్తుల సమక్షంలో హుండీల ఆదాయం లెక్కిస్తామన్నారు.

రేపు కలెక్టర్ ఆధ్వర్యాన 'జగనన్నకు చెబుదాం'

అయినవిల్లి: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆధ్వర్యాన మండల స్థాయి 'జగనన్నకు చెబుదాం' అర్జీల స్వీకరణ కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నారు. తహసీల్దార్ సీహెచ్ లక్ష్మమ్మ, ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అర్జీలు చేసుకునేవారు ఆధార్ కార్డు, ఫోన్ నంబరు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

ప్రశాంతంగా ఊపిరి తీసుకోనిద్దాం

- చిన్నారుల్లో న్యుమోనియా కట్టడికి ప్రభుత్వం చర్యలు
- 'సాన్స్'కు శ్రీకారం
- ఇతర సమస్యల పైనా దృష్టి
- మాతా, శిశు మరణాలను అరికట్టే దిశగా అడుగులు
- విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు



సాన్స్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది

రాయవరం: ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఏర్పాటు చేసే లక్ష్యంతో ప్రభుత్వం తల్లీబిడ్డల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తోంది. ముఖ్యంగా అప్పుడే బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. పసికందుల ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లులకు అవగాహన కల్పించే దిశగా అడుగులు వేస్తోంది. ఐదేళ్లలోపు చిన్నారులకు ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులు అధికంగా వచ్చే అవకాశముంటుంది. అందులోనూ న్యుమోనియా వంటి ప్రాణాంతక వ్యాధుల ప్రమాదం పొంచి ఉంటుంది. దేశంలో ఐదేళ్ల లోపు చిన్నారుల మరణాలకు అత్యధికంగా ఇదే కారణమవుతోందని గుర్తించారు. ఇటువంటి వ్యాధుల నివారణకు వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా ప్రభుత్వం పీసీవీ వ్యాక్సిన్ వేస్తోంది. దీనికోసం సోషల్ అవేర్‌నెస్ అండ్ యాక్షన్ టు న్యూట్రలైజ్ న్యుమోనియా సక్సెస్‌ఫుల్లీ (సాన్స్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

న్యుమోనియా లక్షణాలివీ..

- అధికంగా దగ్గు, జలుబు, అధిక జ్వరం
- ఎక్కువగా శ్వాస తీసుకోవడం. శ్వాస తీసుకునేటప్పుడు ఛాతి ఎముకలు కనిపించడం. శ్వాస తీసుకునే సమయంలో శబ్దం.
- ఎక్కువగా నిద్రపోవడం.
- ఆహారం, నీరు తీసుకోకపోవడం

న్యుమోనియా నుంచి రక్షణకు..

- న్యుమోనియా నుంచి పిల్లలను రక్షించుకోవడానికి పలు జాగ్రత్తలు తీసుకోవాలి.
- బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి పాలు ఇవ్వాలి. ఆరు నెలల వరకూ తల్లి పాలు మాత్రమే పట్టాలి.
- ఆరు నెలల వయసు నుంచి తల్లి పాలతో పాటు అదనపు ఆహారం ఇవ్వాలి. ఆహారం ఇచ్చే ముందు, తర్వాత చేతులు శుభ్రంగా కడగాలి.
- పిల్లల మల విసర్జన శుభ్రం చేసిన తర్వాత చేతులు శుభ్రంగా కడగాలి. శరీరాన్ని కూడా పరిశుభ్రంగా ఉంచాలి.
- శరీరాన్ని ఉన్ని దుస్తులతో కప్పి వెచ్చగా ఉండేలా చూడాలి.
- బిడ్డ వయస్సును బట్టి ఇవ్వాల్సిన వ్యాక్సిన్లు సరైన సమయంలో ఇవ్వాలి.
- ఇంట్లో కట్టెల పొయ్యి వాడుతున్నట్లయితే పొగ పోయే విధంగా కిటికీలు తెరచి ఉంచాలి. వంట గ్యాస్ వాడడం సురక్షితం.
- చిన్నారుల్లో న్యుమోనియా లక్షణాలు గమనిస్తే వెంటనే వైద్యుల వద్దకు తీసుకుని వెళ్లాలి.

గర్భిణులపై నిరంతర పర్యవేక్షణ

మహిళ గర్భం దాల్చిన నాటి నుంచి కాన్పు అయ్యే వరకూ వైద్య, ఆరోగ్య శాఖ అండగా నిలుస్తోంది. గర్భిణులకు పోషకాహారం అందించడం, ప్రతి నెలా ప్రత్యేక వైద్యులతో పరీక్షలు, ప్రతి నెలా తొమ్మిదో తేదీన రక్త పరీక్షలు, స్కానింగ్ నిర్వహిస్తున్నారు. బిడ్డ ఎదుగుదలను పరీక్షించి, రక్తహీనతతో బాధ పడుతున్న గర్భిణులకు రక్తం ఎక్కించడం, రక్తం పట్టడానికి ఇంజక్షన్లు ఇవ్వడం, ఫోలిక్ యాసిడ్, ఐరన్, బి-కాంప్లెక్స్, కాల్షియం టాబ్లెట్లు అందిస్తున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో సుఖ ప్రసవాల కోసం కృషి చేస్తున్నారు.

జిల్లాలో శిశు మరణాలు

జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకూ 65 శిశు మరణాలు సంభవించాయి. వీరిలో పుట్టిన 24 గంటల్లో ఆరుగురు, వారం రోజుల వ్యవధిలో 27 మంది, నెల రోజుల్లోపు 11 మంది, నెల నుంచి ఏడాది లోపు 21 మంది మృత్యువాత పడ్డారు. వీరిలో ఇన్ఫెక్షన్ కారణంగా ఒకరు, ఊపిరి ఆడక నలుగురు, న్యుమోనియాతో ఒకరు, ఇతర కారణాలతో 51 మంది మృత్యువాత పడినట్టు వైద్య, ఆరోగ్య శాఖ గుర్తించింది.

లక్షణాలు గుర్తిస్తే..

ఐదేళ్ల లోపు చిన్నారుల మరణాలకు ప్రధాన కారణం ఇన్ఫెక్షన్లకు గురవడం. వైరస్ లేదా బ్యాక్టీరియా వల్ల ఇన్ఫెక్షన్లు అధికంగా వస్తుంటాయి. సహజంగానే చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస వేగంగా తీసుకోవడం, పాలు తాగలేక పోవడం, అధికంగా ఏడవడం, ఆయాసపడటం, కొన్నిసార్లు శరీరంపై దద్దుర్లు లేదా ఎర్రమచ్చలు ఏర్పడటం వంటి లక్షణాలు గుర్తిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ముఖ్యంగా చలి కాలంలో ఇన్ఫెక్షన్లు అధికంగా వచ్చే అవకాశముంటుంది. అందుకే శిశు మరణాలను తగ్గించేందుకు చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నారిలా..

జిల్లాలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా గర్భిణులకు, తల్లులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పౌష్టికాహారం, సుఖ ప్రసవం, తల్లిపాలు పట్టడం, నాటు వైద్యాలకు దూరంగా ఉండటం, చిన్న పిల్లలకు ప్రాణాంతక వ్యాధులు, వ్యాధి నిరోధక వ్యాక్సిన్ల వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి నెలా బిడ్డ ఎదుగుదల, బరువు గమనిస్తూ అవసరమైన వారికి తగిన వైద్య సేవలు అందిస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గర్భిణుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలందిస్తున్నారు. చిన్నారులకు దగ్గు, జలుబు, జ్వరం వచ్చినప్పుడు న్యుమోనియా వచ్చే అవకాశముంటుందనే అంశంపై ప్రధానంగా అవగాహన కల్పిస్తున్నారు. చలి అధికంగా ఉండే కాలం కావడంతో ఈ నెల 12 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 29 వరకూ ఈ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఆస్పత్రుల వివరాలు

ప్రభుత్వ ఏరియా ఆస్పత్రులు:	3
సీహెచ్‌సీలు:	9
పీహెచ్‌సీలు:	46
అర్బన్ హెల్త్ సెంటర్లు:	07
వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు:	515
ప్రైవేట్ ఆస్పత్రులు:	174

తల్లి తీసుకునే జాగ్రత్తలే ప్రధానం



గర్భం దాల్చినప్పటి నుంచి తల్లి ఆహారం, వ్యాధి నిరోధక టీకాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. గర్భం దాల్చిన సమయంలో బీపీ, షుగర్ వచ్చే అవకాశమున్నందున క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. కనీసం రెండుసార్లు స్కానింగ్ చేయించుకుని బిడ్డ ఎదుగుదలను పరీక్షించుకోవాలి. బిడ్డ జన్మించినప్పటి నుంచి ఏడాది వయస్సు వరకూ కంటికి రెప్పలా కాపాడుకోవాలి. సమయానికి వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి.

– డాక్టర్ బీవీవీ సత్యనారాయణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, అమలాపురం

అవగాహన కల్పిస్తున్నాం



న్యుమోనియాపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నాం. చలి కాలం మూడు నెలల పాటు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల పరిధిలో ర్యాలీలు, అవ గాహన సమావేశాల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నాం. పీహెచ్‌సీలు, సచివాలయాలు, ముఖ్య కూడళ్ల వద్ద 'సాన్స్' కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు బ్యానర్లు, పోస్టర్లు ప్రదర్శిస్తున్నాం.

– డాక్టర్ దుర్గారావుదొర, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి, అమలాపురం